

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 308 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 10, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్






# జాతీయ వాదాన్ని దిగజారుస్తున్నారు!

● జాతీయవాదాన్ని దిగజారుస్తున్నారు ● జాతీయ వాదం దెబ్బతింటుంది ● దేశాన్ని ప్రమాదంలోనికి నెట్టేస్తున్నారు. ● లక్షల కోట్ల ఆస్తుల దోపిడి మాజీ న్యాయమూర్తులకు కన్పించడం లేదా. ● అయోధ్య రామాలయంలో 105 సార్లు దొంగతనం జరగగా మీరంతా ఏడపోయారు. ● గోమూత్రం తాగెటోళ్ళకు “గీ”లాంటి ఆలోచనలు వస్తాయి. ● అబద్దాలను అద్భుతంగా ప్రకటిస్తున్న ఈసీ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్. ● కొంతమంది సంపన్నుల చేతుల్లో దేశ సంపద ● ప్రపంచ దేశాలు చీదరించుకుంటున్న సిగ్గు ఎందుకు రావడం లేదు ● ప్రజాస్వామ్యాన్ని ప్రజల ముందే నాశనం చేస్తూ దర్జాగా తిరుగుతున్నారు. ● జాతీయ వాదంపై దాడి చేసే వాళ్లను బరతం పట్టాల్సిందే. ● డాక్టర్ బరిగెల శివ.




డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

**దేశ జాతీయవాదాన్ని దిగజారుస్తూ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారని డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు. అధికార పదవుల వ్యామోహంతో రాజ్యాంగ విలువలను, ప్రజల హక్కులను విస్మరిస్తున్నారని విమర్శించారు.** ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ విధులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. దేశ ఆర్థిక లావాదేవీలు, కేంద్ర ప్రభుత్వ అప్పులు, నిధుల వినియోగంపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం, బడా వ్యాపార సంస్థల రుణమాఫీల వివరాలను వెల్లడించాలని అన్నారు. ప్రధాన ఆలయాల్లోని నిధుల భద్రత, లెక్కల నిర్వహణపై స్పష్టత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులు, యువతపై దాడులు, అక్రమ కేసులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ విధానాలపై న్యాయవ్యవస్థ సమగ్రంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపాదించారు. రాజకీయ నాయకుల ఆస్తులు, వ్యాపార సంస్థల అక్రమ సంపదపై విచారణ జరపాలని కోరారు. ఈ అంశాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులు తమ వైఖరిని వెల్లడించాలని డాక్టర్ బరిగెల శివ డిమాండ్ చేశారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2

## మూడేళ్లుగా ముసుగులోనే మాజీ మంత్రి విగ్రహం!

జన్మ శతాబ్ది సంవత్సరంలోనైనా ఆవిష్కరించాలి
పుట్టపాగ మహేంద్రనాథ్ కుమారుడి విజ్ఞప్తి
ఏళ్ల తరబడి నిరీక్షణపై కుటుంబ సభ్యుల ఆవేదన
మేధావులు, ఉద్యోగులు, ప్రజాసంఘాలు స్పందించాలి
అధికారులు చొరవ చూపాలని కోరిన కుమారుడు

2



## తెలంగాణపై కరవు పంజా!

ఈ నెల 12న మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష
17 శాతం తగ్గిన వర్షపాతం.. 320 మండలాల్లో కరవు ఛాయలు
రైతుల కష్టాలు.. సాగు, తాగునీటి సమస్యలపై చర్చ
కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కోరిన రాష్ట్రం
అక్టోబరు చివరి నాటికి సమగ్ర కరవు నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు

2





## దసరా పండుగ సందడి.. కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్

దసరా సెలవులతో హైదరాబాద్ బస్టాండ్లలో పెరిగిన ప్రయాణికుల రద్దీ
రాష్ట్రవ్యాప్తంగా 7,000 ప్రత్యేక బస్సులను నడుపుతున్న టీజీఎస్ఆర్టీసీ
ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీలపై 50 శాతం అదనం
మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం యథాతథం
ప్రయాణికుల కోసం ప్రధాన టెర్మినల్లలో అదనపు సౌకర్యాల ఏర్పాటు

2

## దాడుల “పరంపర” దేనికి మంచిది

నిజాయితీ కలిగిన అధికారులను వెంటాడుతూ.... వేధిస్తున్నారు.
వికలాంగుడైన ఆచార్యున్ని అంతటి అసభ్య పదజాలంతో దూషించవచ్చా.
అధికారులపై విద్యార్థులు దుర్భాషలాడడం దేనికి సూచన.
కేయూ కళాశాల ప్రిన్సిపల్ రాజీనామా వెనకాల జరిగిన కుట్రలు ఏమిటి.
ప్రిన్సిపాల్ కార్యాలయంలోనే సీసీటీవీ ఫుటేజ్ వీడియోను బయటపెట్టాలి.
వికలాంగులైన ఆచార్యులపై విరుచుకుపడుతున్నారు.
అధికార పదవులను కాపాడుకోవడం కోసమే ప్రిన్సిపాల్ పై దాడి జరిగిందా.!
ప్రిన్సిపాల్ ఆచార్య తాళ్లపల్లి మనోహర్ రాజీనామాకు కారణాలు ఏమిటి.

3



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# మూడేళ్లుగా ముసుగులోనే మాజీ మంత్రి విగ్రహం!

**జన్మ శతాబ్ది సంవత్సరంలోనైనా ఆవిష్కరించాలి**
**పుట్టపాగ మహేంద్రనాథ్ కుమారుడి విజ్ఞప్తి**
**ఏళ్ల తరబడి నిరీక్షణపై కుటుంబ సభ్యుల ఆవేదన**
**మేధావులు, ఉద్యోగులు, ప్రజాసంఘాలు స్పందించాలి**
**అధికారులు చొరవ చూపాలని కోరిన కుమారుడు**

**నాగర్‌కర్నూల్ (జై భీమ్ న్యూస్):**

నాగర్‌కర్నూల్‌కు చెందిన దివంగత మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ విగ్రహం ఏర్పాటు చేసి మూడేళ్లు గడుస్తున్నా, ఇప్పటివరకు ఆవిష్కరణకు నోచుకోకపోవడంపై ఆయన కుమారుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహానికి ముసుగు వేసి ఉంచినప్పటికీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. మహేంద్రనాథ్ జన్మ శతాబ్ది సంవత్సరం కొనసాగుతున్న నేపథ్యంలోనైనా విగ్రహాన్ని తక్షణమే ఆవిష్కరించి, ఆయనకు తగిన గౌరవం కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రజా జీవితంలో సేవలందించిన నాయకుడి విగ్రహం మూడేళ్లుగా ముసుగులోనే ఉండిపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై నాగర్‌కర్నూల్‌కు చెందిన మేధావులు, ఉద్యోగులు, ప్రజాసంఘాల ప్రతినిధులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, విగ్రహావిష్కరణ కార్యక్రమం త్వరగా జరిగేలా చొరవ చూపాలని కోరారు. ప్రస్తుతం బెంగళూరులో ఉన్న ఆయన కుమారుడు అక్కడి నుంచే నాగర్‌కర్నూల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పుట్టపాగ మహేంద్రనాథ్ సేవలను గుర్తుచేసుకుంటూ, ఆయన విగ్రహావిష్కరణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జన్మ శతాబ్ది సంవత్సరంలోనైనా విగ్రహావిష్కరణ కార్యక్రమం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటారా అన్నది చర్చనీయాంశంగా మారింది.

# తెలంగాణపై కరవు పంజా!

**ఈ నెల 12న మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష**
**17 శాతం తగ్గిన వర్షపాతం.. 320 మండలాల్లో కరవు ఛాయలు**
**రైతుల కష్టాలు.. సాగు, తాగునీటి సమస్యలపై చర్చ**
**కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కోరిన రాష్ట్రం**
**అక్టోబరు చివరి నాటికి సమగ్ర కరవు నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు**

**హైదరాబాద్, అక్టోబరు 10 (జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో తీవ్ర కరవు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, తక్షణ సహాయక చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నెల 12న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ రంగంపై వాటి ప్రభావం, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. అక్టోబరు 6 నాటి ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 33 జిల్లాలకు గాను 18 జిల్లాల్లోని 320 మండలాలు తీవ్ర కరవు ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయి. మొత్తం 621 మండలాల్లో దాదాపు సగం మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, విద్యుత్ డిమాండ్ వంటి కీలక అంశాలపై ప్రభుత్వం సమీక్షించనుంది. వర్షాభావంతో పంటలు, రైతుల ఆదాయంపై పడే ప్రభావాన్ని అంచనా వేయడంతోపాటు అవసరమైన సహాయక చర్యలను నిర్ణయించే అవకాశం ఉంది. రాష్ట్రాన్ని కరవు పీడిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. తక్షణ సహాయం కింద రూ.20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. మంత్రివర్గ ఉపసంఘం చేపడుతున్న చర్యలు, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు, రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణుల నుంచి సలహాలు స్వీకరించడం వంటి అంశాలు కూడా సమీక్షకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. నిర్దేశించిన 12 ప్రామాణిక అంశాల ఆధారంగా అక్టోబరు చివరి నాటికి సమగ్ర కరవు నివేదిక సిద్ధం చేయాలని సూచించినట్లు వార్తా కథనం పేర్కొంది. ఈ నివేదిక ఆధారంగా కరవు తీవ్రతను అంచనా వేయడం, సహాయక చర్యలను రూపొందించడం, కేంద్రం నుంచి ఆర్థిక సాయం కోరడం వంటి అంశాల్లో తదుపరి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రైతులకు ఉపశమనం కల్పించడం, తాగునీటి సమస్యలను అధిగమించడం, సాగు రంగానికి అవసరమైన సహకారం అందించడం ఈ సమీక్షలో కీలకంగా మారనున్నాయి.

## దసరా పండుగ సందడి.. కిక్కిరిసిన ఎంజీబీఎస్, జేబీఎస్

**దసరా సెలవులతో హైదరాబాద్ బస్టాండ్లలో పెరిగిన ప్రయాణికుల రద్దీ**
**మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం యథాతథం**
**ప్రయాణికుల కోసం ప్రధాన టెర్మినల్లలో అదనపు సౌకర్యాల ఏర్పాటు**

**హైదరాబాద్, అక్టోబరు 10 (జై భీమ్ న్యూస్):**

దసరా పండుగ సెలవులు ప్రారంభం కావడంతో హైదరాబాద్‌లోని ప్రధాన బస్టాండ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. తెలంగాణలో పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో, శుక్రవారం సాయంత్రం నుంచే సొంతూళ్లకు వెళ్లేవారి సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. నగరంలోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. కుటుంబ సభ్యులు, విద్యార్థులతో బస్టాండ్ల ప్రాంగణాలన్నీ సందడిగా మారాయి. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం అక్టోబర్ 18వ తేదీ వరకు మొత్తం 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక సర్వీసుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్ నుంచి 3,533 బస్సులు నడుస్తుండగా, హైదరాబాద్ జోన్ నుంచి 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 బస్సులు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ఉప్పల్, ఆరాంఘర్, ఎల్బీ నగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి వంటి కీలక ప్రాంతాల నుంచి కూడా ఈ ప్రత్యేక సర్వీసులు నడుస్తున్నాయి. అయితే, ఈ ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఛార్జీలను 1.5 రెట్లు (50 శాతం అదనంగా) పెంచినట్లు టీజీఎస్‌ఆర్టీసీ వెల్లడించింది. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే అక్టోబర్ 9, 10, 16, 17 తేదీలతో పాటు, తిరుగు ప్రయాణ రద్దీ ఉండే అక్టోబర్ 25, 26 తేదీల్లో ఈ పెంచిన ఛార్జీలు వర్తిస్తాయి. సాధారణ బస్సు సర్వీసుల్లో ఛార్జీలలో ఎలాంటి మార్పు లేదని, 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన బస్టాండ్లలో తాత్కాలిక షెల్టర్లు, తాగునీటి సౌకర్యం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, మొబైల్ టాయిలెట్లను ఆర్టీసీ ఏర్పాటు చేసింది. సెలవుల అనంతరం తిరుగు ప్రయాణ రద్దీని కూడా దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న మార్గాల్లో అవసరాన్ని బట్టి అదనపు బస్సులను నడుపుతామని, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# జాతీయవాదాన్ని దిగజారుస్తున్నారు

**జాతీయ వాదం దెబ్బతింటుంది.**
**దేశాన్ని ప్రమాదంలోనికి నెట్టేస్తున్నారు.**
**లక్షల కోట్ల ఆస్తుల దోపిడి మాజీ న్యాయమూర్తులకు కన్పించడం లేదా.**
**అయోధ్య రామాలయంలో 105 సార్లు దొంగతనం జరగగా మీరంతా ఏడపోయారు.**
**గోమూత్రం తాగెటోళ్ళకు "గీ"లాంటి ఆలోచనలు వస్తాయి.**
**అబద్దాలను అద్భుతంగా ప్రకటిస్తున్న ఈసీ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్.**
**కొంతమంది సంపన్నుల చేతుల్లో దేశ సంపద**
**ప్రపంచ దేశాలు చీదరించుకుంటున్న సిగ్గు ఎందుకు రావడం లేదు**
**ప్రజాస్వామ్యాన్ని ప్రజల ముందే నాశనం చేస్తూ దర్జాగా తిరుగుతున్నారు.**
**జాతీయ వాదంపై దాడి చేసే వాళ్లను బరతం పట్టాల్సిందే.**
**డాక్టర్ బరిగెల శివ.**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

భారతదేశ జాతీయ వాదాన్ని దెబ్బతీస్తున్న వ్యక్తులను తరిమికొట్టాలని డాక్టర్ బరిగెల శివ పిలుపునిచ్చారు. అవకాశవాద రాజకీయాలకు అలవాటు పడి అధికార పదవులపై ఉన్న మోజుతో జాతీయవాదాన్ని దిగజారుస్తున్నారని మండిపడ్డారు. దేశ ప్రయోజనాలను దెబ్బతీస్తూ ఇతర దేశాల పేర్లను ఇతర దేశాల వ్యక్తులను వాటికి బాధ్యులను చేసే ప్రయత్నం చేస్తూ దగుల్బాజీ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. 12 సంవత్సరాల చరిత్రలో భారత దేశంలో చొరబాటుదారులంటూ పుల్వామా, పహాల్గాం దాడులను చేయించి దేశ సమగ్రతను భారత దేశ జాతీయ వాదాన్ని తీవ్రమైన స్థాయిలో దెబ్బ కొట్టారని మండిపడ్డారు. కాశ్మీర్ మణిపూర్ లాంటి రాష్ట్రాల్లో మతపరమైన గొడవలను మతపరమైన చిచ్చులను రేపి మణిపూర్ రాష్ట్రం మంటల్లో కాలుతున్న కనీసం అటువైపు చూడకుండా దానిని పట్టించుకోకుండా జాతీయవాదంపై దాడులు చేస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు. ప్రజాస్వామ్య విలువలతో రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో భాగంగా ధర్నాలు నిరసనలు చేసుకునే హక్కు ఉన్నప్పుడు దేశంలో జరుగుతున్న ధర్నాలకు ఇతర దేశస్తులను ఇతర మతస్తులను బాధ్యులను చేస్తూ కఠినంగా శిక్షిస్తామనడం కేంద్ర ప్రభుత్వం చేతగానితనానికి, మూర్ఖత్వపు తనానికి నిదర్శనంగా మారిపోయిందన్నారు. అధికార పదవుల పిచ్చి పైశాచికానికి చేరిపోయి ప్రజలను చిత్రహింసలకు గురిచేయడం నిత్యవసరాల ధరను ఆకాశానికి చేరేలా చేసి ప్రజలను కనీసపు కూడుకు నోచుకోకుండా చేయడం కేంద్ర ప్రభుత్వం పాటిస్తున్న క్రూరత్వంలో జాతీయ వాదం ఎంతలా దెబ్బతింటుందో 42 మంది సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు అర్థం చేసుకోవాలన్నారు. న్యాయమూర్తుల హోదాలో ఉండి దేశంలో జరుగుతున్న దౌర్భాగ్యపు పనులపై స్పందించాల్సింది పోయి అరాచక శక్తులను కాపాడడానికి ప్రయత్నం చేయడం సరైనది కాదన్నారు.

### దేశ బడ్జెట్ పై స్పష్టత ఇవ్వగలరా.!

దేశ సమగ్రతకు దేశ భద్రతకు ప్రమాదం వాటిల్లుతుందని తెలిసినప్పటికిని అత్యంత మేధావులైన దేశంలోని ప్రధాన న్యాయస్థానాన్ని నడిపించినటువంటి 42 మంది మాజీ ప్రధాన న్యాయమూర్తులు ఈసీ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కు సహకారంగా ఉత్తరాలు రాయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈసీ కమీషనర్ జ్ఞానేష్ కుమార్ నిర్వహించిన విధుల పట్ల సమగ్ర విచారణకు దేశ ప్రజలు డిమాండ్ చేస్తుండగా విచారణ జరగకముందే ఈసీ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తప్పిదాలకు పాల్పడలేదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు ఎలా నిర్ధారణకు వచ్చారంటూ సూటిగా అడిగారు. ఇదే 42 మంది సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తుల సమక్షంలో బిజెపి ప్రభుత్వం 12 సంవత్సరాల కాలంలో పార్లమెంటు సాక్షిగా ప్రవేశపెట్టిన బడ్జెట్ వివరాలను ఆదాయ లావాదేవీలను ఖర్చులను, మనీలాండరింగ్ కు పాల్పడినారు అనే ఆరోపణలపై పూర్తిస్థాయిలో లెక్కలు సిద్ధపరచి దేశ ప్రజలకు స్పష్టత రావడం కోసం కేంద్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసే విధంగా బాధ్యత తీసుకొని దేశ ప్రజల నిధులు దుర్వినియోగం జరగలేదని కేంద్ర ప్రభుత్వం ద్వారా సొంత పూచికత్తుపై బహిరంగ ప్రకటన చేయించే విధంగా శ్రద్ధ చూపాలని కోరారు. ప్రధానమంత్రి సహాయనిధి స్కీం మొదలుకొని దేశంలోని ప్రతి కేంద్ర మంత్రుల సహాయ నిధుల నుండి ఎంత సొమ్ము ప్రజల కొరకు ఖర్చు చేయబడినదో ఎంత సొమ్ము దుర్వినియోగ పరచబడినదో ఎంత సొమ్ము పదావుగా ఉంచబడినదో 42 మంది సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు తెలియజేస్తే బాగుంటుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 12 సంవత్సరాల కాలంలో ఆర్బిఐ(రిజోర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) నుండి కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన అప్పుల లెక్కలపై శ్వేత పత్రం విడుదల చేసే బాధ్యతను తీసుకోవాలని కోరారు. అదే సందర్భంలో వరల్డ్ బ్యాంక్ నుండి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న అప్పుల వివరాలను బయటపెట్టాలని కోరారు. అయోధ్య రామాలయంలో సుమారుగా 105 సార్లు జరిగిన దొంగతనంతో పాటు దేశంలోని ప్రధాన ఆలయాలలోని విలువైన నిధులు వాటి లెక్కలు వాటి ఆడిట్స్ వాటి ఆధారాలు ఎటువైపు దారి మళ్ళించబడుతున్నాయో 42 మంది మాజీ ప్రధాన న్యాయమూర్తులు లేఖల రూపంలో తెలియజేస్తే దేశ ప్రజలకు ఎంతో నమ్మకం కలుగుతుందన్నారు. దేశాన్ని దేశంలోని ధనాన్ని ప్రజల సొమ్మును లక్షల కోట్ల రూపాయలు దోచుకోవడమే కాకుండా లక్షల కోట్ల రూపాయలు బ్యాంకుల ద్వారా రుణం మాఫీ చేసుకున్న బడా వ్యాపారస్తుల ఆస్తుల వివరాలను వాళ్లు అక్రమంగా పొందుకున్న బ్యాంకుల రుణమాఫీలను ఇదే 42 మంది మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు వాళ్ళ లేఖల ద్వారా దేశ ప్రజలకు తెలియజేయాలని కోరారు. సుప్రీంకోర్టును అభాసపాలు చేసే మార్గాల నెంచుకొని జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ సిద్ధపరచిన ఫారం 6కు సుప్రీంకోర్టు అనుమతించిందని పచ్చి అబద్ధాలు ఆడుతున్నప్పుడు వాటి ఆధారాలను వాటి వివరాలను లేఖల రూపంలో విడుదల చేసి దేశ ప్రజలకు సత్యాన్ని తెలియజేయాలని కోరారు. పార్లమెంటు అనుమతి కోరకుండా పార్లమెంటు సవరణను అనుసరించకుండా ఫారం 6 సిద్ధపరచడమే కాకుండా కోట్లాది ఓట్లను తొలగిస్తూ ప్రజల అస్తిత్వాన్ని దెబ్బతీసిన ఈసీ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను వెనకేసుకురావడం జాతీయ ఎన్నికల కమిషన్ ఆగడాలను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు పెంచి పోషిస్తున్నట్లుగా ఉందన్నారు. 12 సంవత్సరాలుగా లక్షల సంఖ్యలో ఈవీఎంలు ఎందుకు ధ్వంసం చేయబడినాయో వాటి వివరాలను జాతీయ ఎన్నికల కమిషనర్ తో పాటు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు దేశ ప్రజలకు తెలియజేయాలన్నారు. జాతీయ ఎన్నికల కమిషన్ అధికారి క వెబ్సైట్లో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని తొలగించబడిన ఓట్లను ఎందుకు జతపరచాలని ఉత్తర్వులను ప్రకటించారో వాటి ఖర్చు ఎవరు భరించాలో దేశ ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఎవరిదో కూడా న్యాయమూర్తులే తెలియజేయాలన్నారు. దేశాన్ని అత్యున్నత స్థాయిలో రక్షిస్తున్న న్యాయస్థాన వ్యవస్థలు వ్యక్తిగత స్వార్థాలకు అవకాశాలు కల్పిస్తూ దేశ భవిష్యత్తును దేశ జాతీయవాదాన్ని దేశ ఆర్థిక నిధులను నిట్ట నిలువునా ముంచేస్తూ, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వ్యక్తుల పట్ల సహకారాన్ని, సహాయాన్ని ప్రదర్శించడం ఏ చట్టంలో ఉందో ఇదే మాజీ న్యాయమూర్తులు దేశ ప్రజలకు తెలియజేస్తే బాగుంటుందన్నారు.

### దాడులపై దండిగా పోరాటం

ఉద్యమాలను అణిచివేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న అధికార దుర్వినియోగం దేశ ప్రజలందరూ గమనించాలని పిలుపునిచ్చారు. చట్టాలను తమ అనుకూలంగా మార్చుకొని పేద ప్రజల ఉసురు పోసుకుంటామంటే ఊరుకునేది లేదన్నారు. అన్ని జాతుల ప్రజలను అన్ని కులాల ప్రజలను అవమానపరచడం జాతీయ భావం ఎలా అవుతుందో కేంద్ర ప్రభుత్వ పెద్దలు దేశ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. దేశవ్యాప్తంగా ధర్నాలు చేస్తున్న ప్రతి రాష్ట్రంలో ఉద్యమకారులు దండిగా దెబ్బలు తింటున్నారని కొన్ని రాష్ట్రాల్లో దెబ్బలు తింటున్నప్పటికిని ఎదురు తిరిగి పోరాటం చేస్తూ హక్కుల రక్షణ కోసం రక్తాలు కారుస్తున్నారని బాధపడ్డారు. ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాల పట్ల దేశ ఆర్థిక భద్రత వ్యతిరేక కార్యక్రమాల పట్ల ధర్నాలు చేస్తున్న యువతను కిరాతకంగా దాడులు చేయించడమే కాకుండా కేంద్ర బలగాలను పోలీస్ బలగాలను ఢిల్లీ పోలీసులను యువతపై దాడులకు ఉసిగొలులుతూ దేశాన్ని రక్తసిక్తంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోనే 60 శాతం న్యాయస్థానం, న్యాయవ్యవస్థ ఎవరికి భయపడకుండా దేశాన్ని రక్షించే ప్రయత్నం చేస్తుండగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు మాత్రం దేశాన్ని దరిద్రంగా మారుస్తున్న అధికార యంత్రాంగానికి పూర్తి మద్దతునిస్తూ తమ స్వలాభాల కోసం దేశ న్యాయవ్యవస్థను తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తుండడమే కాకుండా జాతీయ ఎన్నికల కమిషన్ ఆగడాలను దేశవ్యాప్తంగా కొనసాగించడానికి నిష్ఠతను ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు.

### ప్రధాన డిమాండ్స్

1)భారత రాజ్యాంగ శాశ్వత రక్షణకు పార్లమెంట్ సాక్షిగా చట్టం తీసుకురావాలి.

2)జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి.

3)"సర్" ప్రక్రియ విధానాన్ని ఉన్నపాటుగా రద్దు పరచాలి.

4)జాతీయ ఎన్నికల కమిషనర్ నియామక చట్టంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సభ్యునిగా చేరుస్తూ రాజ్యాంగ చట్టాన్ని సవరించాలి.

5)మూడు సంవత్సరాలుగా జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నిర్వహించిన విధులపై సమగ్ర విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలి.

6)సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తుల సంఘం జాతీయ ఎన్నికల కమిషన్ విధానాలపై సుమోటో కేసు స్వీకరించాలి.

7)దేశవ్యాప్తంగా బ్యాలెట్ ఎన్నికల ద్వారా ఎలక్షన్లు నిర్వహిస్తూ ఈవీఎం మిషన్ల ఎన్నికలను రద్దు పరచాలి.

8)ఢిల్లీలో విద్యార్థి మేధావులపై కడుతున్న అక్రమ కేసులు అన్ని రద్దు చేయాలి.

9)రాజకీయ నాయకుల ఆస్తులపై విచారణ చేపట్టాలి.

10)వ్యాపారస్తుల అక్రమస్తులను జప్తు చేయాలి.

పైన పేర్కొనబడిన 10 ప్రధాన డిమాండ్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు తమ వైఖరిని ప్రకటిస్తూ తమ నిజాయితీని కనపరచుకొనుటకు బహిరంగ ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# బీజామృతం తయారీ, వినియోగంపై రైతులకు శిక్షణ

**హసన్‌పర్తి, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్)**

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్) పథకం కింద హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని మడిపల్లి గ్రామాన్ని 2026--27 సంవత్సరానికి ఎంపిక చేశారు. ఈ పథకం ద్వారా గ్రామానికి చెందిన 125 మంది రైతులను ఎంపిక చేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ అందించనున్నారు. ప్రతి రైతు కనీసం ఒక ఎకరం భూమిలో ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. కార్యక్రమంలో భాగంగా మడిపల్లి గ్రామానికి చెందిన రైతు వెల్దండి శ్రీరాములు వ్యవసాయ క్షేత్రంలో బీజామృతం తయారీ, వినియోగంపై రైతులకు ప్రాయోగిక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మడిపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) బందెల సుమన్ రైతులకు బీజామృతం తయారీ విధానం, విత్తన శుద్ధిలో దాని ప్రాధాన్యతను వివరించారు. 20 లీటర్ల నీటిలో 5 కిలోల ఆవు పేడను కాటన్ వస్త్రంలో మూటకట్టి 12 నుంచి 16 గంటల పాటు ఉంచాలని, మరో లీటరు నీటిలో 50 గ్రాముల సున్నాన్ని కలిపి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఈ రెండు ద్రావణాలను కలిపి అందులో 5 లీటర్ల ఆవు మూత్రాన్ని జోడించి, ఈ మిశ్రమాన్ని 8 నుంచి 12 గంటల పాటు ఉంచిన తరువాత ఒక పిడికెడు పుట్టమట్టిని కలపాలని



వివరించారు. ఈ విధంగా తయారైన బీజామృతాన్ని విత్తనాలు విత్తే ముందు వాటికి పట్టించి విత్తుకోవాలని సూచించారు. బీజామృతం విత్తన శుద్ధికి ఉపయోగపడటంతో పాటు విత్తనాల ద్వారా వ్యాపించే కొన్ని చీడపీడలు, తెగుళ్ల సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో స్థానికంగా లభించే సహజ వనరులను వినియోగించుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని, సహజ పద్ధతులను రైతులు మరింతగా అవలంబించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులు చింత రమేష్, బుర్ర చంద్రమౌళి, ఆకుల ఇంద్రయ్య, వెల్దండి వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎన్ఎంఎన్ఎఫ్ పథకానికి సంబంధించిన కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు (సీఆర్‌పీలు) కె. రవళి, టీ. రమ్య పాల్గొని కార్యక్రమానికి సహకరించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడం, సహజ వనరుల వినియోగాన్ని పెంచడం, సాగు ఖర్చులను తగ్గించే విధానాలను ప్రోత్సహించడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# దాడుల "పరంపర" దేనికి మంచిది




**నిజాయితీ కలిగిన అధికారులను వెంటాడుతూ.... వేధిస్తున్నారు.**
**వికలాంగుడైన ఆచార్యున్ని అంతటి అసభ్య పదజాలంతో దూషించవచ్చా.**
**అధికారులపై విద్యార్థులు దుర్భాషలాడడం దేనికి సూచన.**
**కేయూ కళాశాల ప్రిన్సిపల్ రాజీనామా వెనకాల జరిగిన కుట్రలు ఏమిటి.**
**ప్రిన్సిపాల్ కార్యాలయంలోనే సీసీటీవీ ఫుటేజ్ వీడియోను బయటపెట్టాలి.**
**వికలాంగులైన ఆచార్యులపై విరుచుకుపడుతున్నారు.**
**అధికార పదవులను కాపాడుకోవడం కోసమే ప్రిన్సిపాల్ పై దాడి జరిగిందా.!**
**ప్రిన్సిపాల్ ఆచార్య తాళ్లపల్లి మనోహర్ రాజీనామాకు కారణాలు ఏమిటి.**

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-**

కాకతీయ విశ్వవిద్యాలయంలో నిజాయితీగా పనిచేసే పాలనాధికారులు చాలా అరుదుగా ఉన్నారని అలాంటి అధికారులలో ప్రిన్సిపాల్ ఆచార్య తాళ్లపల్లి మనోహర్ ప్రధాన స్థానంలో ఉంటారని విశ్వవిద్యాలయమే కాకుండా భాహ్య సమాజంలో ప్రతి ఒక్కరికి తెలుసునని గర్వపడడంలో ఎలాంటి సందేహం లేదు.ఆచార్య మనోహర్ కేయూ కళాశాల ప్రిన్సిపాల్ పదవికి గురువారం సాయంత్రం రాజీనామా చేసినట్లు విశ్వవిద్యాలయంలో పలువురు చర్చించుకుంటున్నారు.గత రెండు రోజుల వ్యవధిలో ప్రిన్సిపాల్ కార్యాలయం లోపల జరిగినటువంటి గొడవే తన పదవి రాజీనామా చేయడానికి కారణమైందంటూ పలువురు మేధావులు భావిస్తున్నారు.ఈ మధ్యకాలంలో విద్యార్థి సంఘాల నేతలు పాలన అధికారులను స్వయంగా బూతులు తిడుతుండడం కొత్తేమీ కాకపోయినప్పటికీ నిజాయితీగా పనిచేసే అధికారులపై ఇలాంటి దుర్భాషలతో కూడిన దాడులు చేయడం ముమ్మాటికి సహించరానిదని విశ్వవిద్యాలయంలోని మేధావులు అంటున్నారు.గొడవకు జరిగిన కారణాలు గొడవకు దారి తీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ చేపట్టాలని మేధావులు డిమాండ్ చేస్తున్నారు.కేయూలో కేవలం ఒక ఉన్నతాధికారి తన పదవిని కాపాడుకోవడం కోసం విద్యార్థి సంఘాల నేతలతో రాజకీయాలు చేయిస్తున్నాడంటూ చాలా పెద్ద ఎత్తున ప్రచారం సాగుతుండగా మరోవైపు ఎవరా.... అధికారి ఎందుకోసం ఇంతలా తాపత్రయపడుతూ అధికార పదవుల కోసం రాజకీయాలకు పాల్పడుతున్నాడంటూ విశ్వవిద్యాలయంలో జోరుగా ప్రచారం సాగుతుంది.13 జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కాకతీయ విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఎంతో పరిజ్ఞానవంతుడు,ఎంతో నిజాయితీవంతుడు అయినప్పటికీ మనసును గాయపరచబడే విధంగా దుర్భాషలాడినందునే రాజీనామా చేశాడని పలువురు భావిస్తున్నారు.కేయూలో నిజాయితీపరులుపదవులు చేయాలంటే ఒక రకంగా భయపడిపోతున్న సందర్భంలో నిజాయితీపరుడైనా ఆచార్య తాళ్లపల్లి మనోహర్ రూపంలో తన రాజీనామా వల్ల మరో దెబ్బ ఎదురైందని చెప్పుకోవాలి.కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుత వీసి ఆచార్య ప్రతాప్ రెడ్డి తన పదవీకాలం ఇంచుమించు రెండు సంవత్సరాల వరకు చేరువవుతుండగా ఉన్నపాటుగా ఇలాంటి సంఘటన జరగడం ఒకరకంగా బాధాకరమైనప్పటికిని కాకతీయ విశ్వవిద్యాలయంలో నిజాయితీపరులు పదవులలో కొనసాగడానికి వీలులేదు అనే విధంగా దాడులు జరుగుతుండడం ఒకింత బాధాకరం.గతంలో మాజీ వీసి హాయంలో ఆచార్య తాళ్లపల్లి మనోహర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ గా కొనసాగుతున్న సందర్భంలో ఇదే రకమైన మానసిక దాడిని కొనసాగించగా తక్షణమే తన పదవికి రాజీనామా చేసి తప్పకున్నారని అదే తరహాలో నేడు కాకతీయ విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ పదవికి రాజీనామా చేయడం ఇంచుమించు అలాంటి దాడులే జరిగాయని పలువురు భావిస్తున్నారు.విశ్వవిద్యాలయ వీసి ఆచార్య ప్రతాప్ రెడ్డి తన పదవి కాలమంతటిలో నిజాయితీపరులపై జరుగుతున్న దాడులను పసిగట్టకుండా దాడులు చేయిస్తున్న వ్యక్తులను పదవి కాలాలలో కొనసాగిస్తూ తన వ్యక్తిగతంగా అభివృద్ధి పరుస్తున్న విశ్వవిద్యాలయానికి తన క్యాబినెట్ లోని ఉన్నతాధికారులే వ్యతిరేక పావులు కదుపుతూ వాళ్ళ వ్యక్తిగత స్వార్థాన్ని వాళ్ళ వ్యక్తిగత అధికార పదవుల దాహాన్ని బలపరుచుకోవడం కోసం స్వయంకృతాపరాధం లేకుండా ఇలాంటి నీచమైన పనులకు పూనుకుంటున్నారని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు.ఏదేమైనా వికలాంగులైన ఆచార్యులను టార్గెట్గా పెట్టుకుంటూ వాళ్ళ నిజాయితీని తట్టుకోకుండా కారణాలు లేకుండా రహస్యంగా కొన్ని కారణాలు వెతుక్కుంటూ దాడులు చేయిస్తుండడం వెనకాల దాగి ఉన్న అదృశ్య అధికారుల రహస్య కుట్రలు వీసీ ప్రతాప్ రెడ్డి గమనించాలని కోరనైనది.విశ్వవిద్యాలయంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి అక్రమాలు పెరిగిపోతుండగా వీసీ ప్రతాప్ రెడ్డి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తుల పట్ల ఇప్పటివరకు ఏ ఒక్కరిపై చర్యలు తీసుకోకపోగా తన కఠినత్వాన్ని తన నిజాయితీని అలాంటి అవినీతి అక్రమార్కులైన అధికారులపై ఉక్కు పాదం మోపడానికి సిద్ధపడుతున్న ప్రతి సందర్భంలో కిందిస్థాయి అధికారులు వాళ్ల పదవుల స్వార్థాలకు ఆశపడి అలాంటి అవినీతి అక్రమార్కులను కాపాడడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నది నిజమైన వాస్తవం.వీసీ ఆచార్య ప్రతాప్ రెడ్డి నిజాయితీకి సరి సమానంగా పనిచేస్తున్న కేయూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య మనోహర్ పదవులపై ఎప్పుడు ఎలాంటి ఆసక్తిని చూపకుండా వ్యవస్థ బాగు కొరకు నిత్యం నిస్వార్థంతో పనిచేసే అధికారిగా గుర్తింపు పొందుకున్నారని తనను మానసికంగాను శారీరకంగాను వేధింపులకు గురి చేయకపోతే కేయూలో పలువురు ముఖ్య అధికారుల పదవులకు అడ్డు వస్తున్నారనే నేపథ్యాన్ని మనసులో పెట్టుకొని తనపై ఈ విధమైనటువంటి పరోక్ష కుట్రలను పన్నుతూ దాడులు నిర్వహించడం కేవలం అధికార పదవులను కాపాడుకోవడం కోసం కొంతమంది అధికారులు చేసిన కుట్ర కోణంలోని భాగమేనంటూ పలువురు హెచ్చరిస్తున్నారు.

**వీసీ చాంబరా వెయిటింగ్ హాలా !**

కాకతీయ విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య ప్రతాప్ రెడ్డి తన అధికార కార్యాలయంలోని ప్రధాన చాంబర్లో రోజువారీగా విశ్వవిద్యాలయ సమస్యల పట్ల లోతైన అంశాలపై పరిష్కార మార్గాలను కనుక్కుంటూ విశ్వవిద్యాలయంలోని అన్ని వర్గాలకు న్యాయం చేయడం కోసం ప్రయత్నం చేస్తుండగా కావాలని కొంతమంది పాలన అధికారులు వీసీ చాంబర్లో తష్టవేస్తూ వేరే అధికారులను గాని వేరే వ్యక్తులను గాని బీసీని కలవనివ్వకుండా బీసీ పరిపాలనకు అడ్డుపడుతూ గంటల తరబడి ఛాంబర్ లో కూర్చొని కాలయాపన చేస్తూ పరిపాలన అభివృద్ధి చెందకుండా అడ్డుపడుతూ ఉండడమే కాకుండా అక్రమమైన పనుల కోసం ఆరాటపడుతూ నిజాయితీగా జరగాల్సిన పనుల పట్ల కాలయాపన చేయిస్తూ వాళ్ల ఆధిపత్యాన్ని కొనసాగించుకోవడం కోసం వీసీ కార్యాలయాన్ని అడ్డాగా మార్చుకున్నారని కేయూలోని అన్ని వర్గాలు తీవ్రంగా చర్చించుకుంటున్నాయి.విశ్వవిద్యాలయంలోని అన్ని సమస్యల పట్ల సంబంధించిన వర్గీయులు వీసి ఆచార్య ప్రతాప్ రెడ్డిని కలుసుకొని వాళ్ల సమస్యలను వాళ్ళ బాధలను చెప్పుకోవడానికి ఎంతో ఆసక్తిగా వీసీ కార్యాలయం వైపు వస్తున్న ప్రతి సందర్భంలో కొంతమంది పాలనాధికారులు వీసీ చాంబర్లో కూర్చొని ఇతరులపై చాడీలు చెబుతూ వారి పదవులకు డోకా లేని విధంగా ప్రవర్తిస్తున్నారు.మొత్తం మీదుగా నిజాయితీ గలిగిన పాలన అధికారులను ప్రధానమైన స్థానాలకు రానివ్వకుండా అధికార దాహం కలిగిన కొంతమంది ఉన్నతాధికారులు ఆచార్య తాళ్లపల్లీ మనోహర్ లాంటి నిజాయితీపరున్ని వెంబడిస్తూ,వెంటాడుతూ, కావాలని గొడవలు సృష్టిస్తూ తన మానసిక స్థితిపై దాడులు చేయిస్తున్నారని ఏదేమైనా విశ్వవిద్యాలయంలో అందరికన్నా అత్యంత సీనియర్ పాలనాధికారిగా పేరుగాంచిన ఆచార్య తాళ్లపల్లి మనోహర్ పై ఇలాంటి దాడులు జరగడం సహించడానికి భరించరానిదని అదే సందర్భంలో విశ్వవిద్యాలయంలో నిజాయితీగా పని చేసిన అధికారుల పట్ల వరుసగా ప్రవర్తించి వాళ్ళ పదవులకు రాజీనామా చేయడానికి కారకులైన వ్యక్తుల పట్ల ప్రస్తుతం తాళ్లపల్లి మనోహర్ లాంటి ఆచార్యునిపై కావాలని అభినందలు వేయడమే కాకుండా బూతులు తిట్టించి రాజీనామా చేసే వరకు వదిలిపెట్టకుండా కక్ష సాధింపులకు పాల్పడిన పాలన అధికారుల పట్ల విశ్వవిద్యాలయ వీసి తక్షణమే స్పందించి ప్రిన్సిపాల్ రాజీనామా పై సమగ్ర విచారణ చేపట్టి దాడికి గొడవకు కారకులైన అధికారులను తక్షణమే పదవులను తొలగిస్తూ విశ్వవిద్యాలయ పరువును విశ్వవిద్యాలయంలో నిజాయితీగా పనిచేస్తున్న తనలాంటి అధికారుల పట్ల బాధ్యతగా నిలవాలని విశ్వవిద్యాలయ సమాజం కోరుతుంది.

**ఎవరి స్వార్థం ఎవరికి లాభం త్వరలో..**

# పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట..

**జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి**
**డాక్టర్ బొనగాని రోహిత్ కుమార్**
**గోపాల్‌పూర్‌లో వైద్య శిబిరం.. 63 మందికి వైద్య పరీక్షలు**

**కమలాపూర్, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్)**

కమలాపూర్ మండలం గోపాల్‌పూర్ గ్రామంలో గ్రామస్తుల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 63 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్సతో పాటు వైద్య సలహాలు అందించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి మలేరియా, డెంగ్యూ పరీక్షలు నిర్వహించగా అన్ని పరీక్షల ఫలితాలు నెగెటివ్‌గా వచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అలాగే బీపీ, షుగర్ సమస్యలు ఉన్న వారికి రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించి తగిన సూచనలు, చికిత్స అందించారు. సాధారణ అనారోగ్య సమస్యలతో వచ్చిన వారిని కూడా పరీక్షించి వైద్య సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, దోమల నివారణతో పాటు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. డాక్టర్ బొనగాని రోహిత్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బీపీ, షుగర్ ఉన్న వారు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని, దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. జ్వరం వచ్చినప్పుడు సొంతంగా మందులు వాడకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మామిడాల అశోక్, ఉపసర్పంచ్ మల్లారెడ్డి రేణుక, ఏఎన్ఎం చి. సంపూర్ణ, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఆశా కార్యకర్తలు శ్రీమతి, అనిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.





# ప్రత్యేక న్యాయస్థానంలో టైపిస్టు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**ములుగు, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్)**

ములుగు జిల్లాలో అత్యాచార, పోక్సో చట్టం కేసుల సత్వర విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానంలో ఒప్పంద ప్రాతిపదికన ఒక టైపిస్టు పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఈ పోస్టుకు నెలకు రూ.19,500 సమీకృత వేతనం చెల్లించనున్నట్లు వెల్లడించారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు తెలంగాణ ప్రభుత్వ సాంకేతిక పరీక్షల్లో ఆంగ్ల టైపురైటింగ్ హయ్యర్ గ్రేడ్ లేదా సమానమైన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. కంప్యూటర్ నిర్వహణపై పరిజ్ఞానం, అర్హత కూడా తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. 01.10.2026 నాటికి 18 సంవత్సరాలు నిండి, 34 సంవత్సరాలు మించని వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు వర్తిస్తుందని పేర్కొన్నారు. టైపింగ్ నైపుణ్య పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. 20 కంటే ఎక్కువ దరఖాస్తులు అందితే నిబంధనల ప్రకారం అర్హత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకు పిలుస్తామని వెల్లడించారు. దరఖాస్తుతో పాటు విద్యార్హతలు, సాంకేతిక అర్హతలు, పుట్టిన తేదీ, వర్తించే సామాజిక వర్గ ధ్రువపత్రం, స్థానికత ధ్రువపత్రాల ధ్రువీకరించిన ప్రతులను జతచేయాలని సూచించారు. అభ్యర్థి చిరునామా రాసిన కవర్‌ను రూ.25 విలువైన తపాలా బిళ్లలతో, తపాలా శాఖ నిబంధనల ప్రకారం రిజిస్టర్డ్ పోస్టు రుసుముకు అనుగుణంగా జతపరచాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను మూసివేసిన కవరులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా ప్రధాన న్యాయస్థానం, ములుగు చిరునామాకు స్పీడ్ పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపించాలని సూచించారు. అక్టోబర్ 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు కార్యాలయానికి చేరాలని స్పష్టం చేశారు. నేరుగా లేదా వ్యక్తిగతంగా దరఖాస్తులు స్వీకరించబోమని, అసంపూర్తిగా ఉన్నవి, గడువు అనంతరం అందిన దరఖాస్తులను తిరస్కరిస్తామని తెలిపారు. పూర్తి నోటిఫికేషన్, ఇతర వివరాల కోసం ఠిములుగు జిల్లా ఈ-కోర్ట్స్ అధికారిక వెబ్‌సైట్‌ది(https://districts.ecourts.gov.in/mulugu?utm_source Rchatgpt.com)ను పరిశీలించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

# మానసిక దివ్యాంగులకు అన్ని హక్కులు ఉన్నాయి

**వారి హక్కులను పరిరక్షించి గౌరవించాలి: జడ్జి పూజిత, డాక్టర్ అనితా రెడ్డి**





**హన్మకొండ, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్)**

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మానసిక దివ్యాంగుల పిల్లలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హనుమకొండ సర్క్యూట్ హౌస్ సమీపంలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో, జిల్లా ఆరోగ్య శాఖ సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎల్ఎస్ఏ కార్యదర్శి, న్యాయమూర్తి నేరెళ్ల వెంకట హైమ పూజిత, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి, అడిషనల్ డీఎంహెచ్ఓ మదన్ మోహన్, డీసీపీయూ ప్రవీణ్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఆశ్రమంలోని పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. "మీకు ఎల్లప్పుడూ అండగా మేమున్నాం.. మీతోనే ఉంటాం" అంటూ వారికి భరోసా కల్పించారు. మానసిక దివ్యాంగులు సమాజంలో సమాన హక్కులు కలిగినవారని, వారి హక్కులను ప్రతి ఒక్కరూ పరిరక్షించి గౌరవించాలని సూచించారు. దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవతో సమానమని పేర్కొంటూ, ప్రభుత్వం దివ్యాంగుల కోసం అందిస్తున్న ప్రత్యేక సంక్షేమ పథకాలు, వైద్య, న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం వైద్యులు పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సుచరిత, వసుధ, హరిత, డాక్టర్లు మల్లిక, రాజ్‌కుమార్, వసంత, రాణి, అనూరాధ, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం భద్రతపై కలెక్టర్ తనిఖీ

**నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి.. అధికారులకు కలెక్టర్ ఆదేశం**

**వరంగల్, 9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఎనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం నెలవారీ తనిఖీలో భాగంగా సందర్శించారు. గోదాంలో భద్రతా ఏర్పాట్లు, నిర్వహణ, రికార్డుల నిర్వహణను పరిశీలించారు.ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, ఎన్నికల సూపరింటెండెంట్ రజిని తదితరులు పాల్గొన్నారు.

# దళిత మహిళపై దాడి ఆరోపణలు.. అమర్నాథ్ గౌడ్ దిష్టిబొమ్మ దహనం



**హన్మకొండ, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్)**

నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామంలో విఓఏగా విధులు నిర్వహిస్తున్న దళిత మహిళ నాగినిపల్లి మాధవిని కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ మాజీ సర్పంచ్ భర్త అమర్నాథ్ గౌడ్ దిష్టిబొమ్మను స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ మాధవిపై జరిగిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అమర్నాథ్ గౌడ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, దీక్షలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ చెట్టుపల్లి శివకుమార్, నాయకులు శ్రీనాథ్, శ్రావణ్, నాగరాజు, మహేష్, శ్రీకాంత్, ఉదయ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# 119 వ జ్ఞానమాల కార్యక్రమం : మహంకాళి భిక్షపతి





**మల్కాజిగిరి జిల్లా జై భీమ్ న్యూస్ :**

కీసర సర్కిల్ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక బాలాజీ నగర్ అంబేద్కర్ మహనీయుల చౌరస్తాలో 119 వ జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహిస్తూ బోధించు సమీకరించు పోరాడు నిన్ను నువ్వు విశ్వసించు ధర్మం మన పక్షాన ఉన్నప్పుడు ఓటమన్నది కల మన పోరాటము భౌతికపరమైనదో సామాజికపరమైనదో కాదు పూర్తిగా ఆత్మ ఔన్నత్యం అయినది సంపద కోసము అధికారం కోసం మనం పోరాటం చేయడం లేదు స్వేచ్ఛ కోసం పోరాడుతున్నాం మానవ వ్యక్తిత్వ పునః సంస్కరణ కోసం పోరాడుతున్నాం ఈ పోరాటమే నా ఆనందానికి మూలం అంటారు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందుకే, ఆవారా ప్రసాద్ చేస్తున్న అన్షిత వ్యాఖ్యలవాళ్లే దళితులపై జరుగుతున్న దాడులను ఎండగట్టడానికి బహుజనులంతా ఏకమై భారత రాజ్యాంగాన్ని కాపాడుకునే దిశలో, కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ అంబేద్కర్ కలలు కన్నా కులరహిత సమ సమాజ స్థాపనకై ప్రతి ఒక్కరూ మహారాష్ట్రలోని సౌందలా కుల రహిత గ్రామముగా తీర్చిదిద్దుటకు బహుజనులు అంత ఏకం కావాలని భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి నిర్వాహకులు మహంకాళి భిక్షపతి కోరారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జమాల్పూర్ నవీన్ గౌడ్ మాజీ కార్పొరేటర్ అంబేద్కర్ కి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది . వీరితో జడల చంద్రశేఖర్ గడ్డం గిరి సంగం కృష్ణ గాదె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేయూ 24వ స్నాతకోత్సవ ఏర్పాట్లపై గవర్నర్‌కు వివరాలు

### నవంబర్ 28న స్నాతకోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు



**కేయూ క్యాంపస్, 9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం 24వ స్నాతకోత్సవాన్ని నవంబర్ 28న నిర్వహించనున్న నేపథ్యంలో, ఏర్పాట్లపై తెలంగాణ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్లాకు అధికారులు వివరాలు అందించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డితో కలిసి పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్నాతకోత్సవ నిర్వహణ విధివిధానాలు, ప్రదానం చేయనున్న అవార్డులు, బంగారు పతకాల వివరాలు, ఇతర ఏర్పాట్ల గురించి గవర్నర్‌కు వివరించినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల ఒక ప్రకటనలో తెలిపారు.

# హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

### డబ్బులు అడిగితే నమ్మొద్దు.. వెంటనే ఫిర్యాదు చేయండి
### ఏసీబీ, హైడ్రా లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి




**హైదరాబాద్, 9 అక్టోబరు 2026 (జై భీమ్ న్యూస్)**

హైడ్రా పేరుతో ప్రజలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా స్పష్టం చేసింది. ఎవరైనా హైడ్రా పేరు చెప్పి డబ్బులు అడిగితే ఎలాంటి చెల్లింపులు చేయవద్దని, వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించింది. హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడుతూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాలు, తమకు అందిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ ప్రకటన విడుదల చేసింది. ఇలాంటి ఘటనలు ఎదురైతే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), హైడ్రా కార్యాలయం లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరింది. అక్రమ నిర్మాణాలు, అనుమతులు లేని భవనాలపై హైడ్రా నేరుగా చర్యలు తీసుకోదని స్పష్టం చేసింది. జీహెచ్‌ఎంసీ, ఇతర సంబంధిత మున్సిపల్ సంస్థల విజ్ఞప్తి మేరకు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ప్రమాదకర భవనాల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. కూలిపోయే స్థితిలో ఉండి ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన భవనాల్లో హాస్టళ్లు నిర్వహించరాదని ఇప్పటికే సూచించినట్లు పేర్కొంది. హాస్టళ్లను సురక్షితమైన భవనాల్లోకి మార్చేందుకు డిసెంబర్ 31 వరకు గడువు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేసింది.

**ఫిర్యాదుల కోసం సంప్రదించాల్సిన నంబర్లు:**

- ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్: 1064
- హైడ్రా కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్: 1070

హైడ్రా పేరు చెప్పి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వారి మాటలు నమ్మి మోసపోవద్దని, ఆలస్యం చేయకుండా ఫిర్యాదు చేయాలని హైడ్రా ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# పూల సోయగాలతో మెరిసిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్..

### అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు!



**కేయూ క్యాంపస్, 9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో శుక్రవారం ఎం.ఎడ్., బి.ఎడ్. విద్యార్థుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, విద్యా విభాగాధిపతి డాక్టర్ నల్లాని శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వల్లూరి రామచంద్రం, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు అనితారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థినులు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పూల అలంకరణలతో కళాశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, ఐక్యత, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి భావితరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ షమీమ్ సుల్తానా, డాక్టర్ బండి వేణు, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ వేణుమాధవ్, మణి, సురేష్‌తోపాటు ఎం.ఎడ్., బి.ఎడ్. విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు ప్రజాస్వామ్యానికి కాపలాదారుడే!

### ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి
### పింగళి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఓటరు చైతన్య కార్యక్రమం

**హనుమకొండ,9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**




ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరుదీ కీలక పాత్ర అని, ఓటు హక్కును నిజాయితీగా, బాధ్యతాయుతంగా వినియోగించుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యమని పింగళి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్ర మౌళి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వడ్డేపల్లిలోని కళాశాలలో నిర్వహించిన ఓటరు చైతన్య కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, డబ్బు, బహుమతులు, ఇతర ప్రలోభాలకు లొంగకుండా భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, సమాజానికి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ చైతన్య రాయబారులుగా నిలవాలని పిలుపునిచ్చారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ, ఓటు సమాజంలో మార్పు తీసుకురాగల శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నాయకులను ఎన్నుకోవాలని, ఓటును అమ్ముకోకుండా ఆత్మసాక్షిగా వినియోగించుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ లేదా డిగ్రీ విద్యను పూర్తి చేసిన అర్హులైన యువత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని సూచించారు. "నా ఓటు -- నా హక్కు, నా బాధ్యత.. నా ఓటు అమ్మకానికి కాదు" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నైతిక ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని వక్తలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుహాసిని, డాక్టర్ అరుణ, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సమల్ ప్రవీణ్, డాక్టర్ లకన్, డాక్టర్ పి. రాజి రెడ్డి, డాక్టర్ మధు, రమేష్ కుమార్, ఉదయశ్రీ, డాక్టర్ సువర్ణ జ్యోతితో పాటు కళాశాల అధ్యాపకులు, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పూల పరిమళాలతో ఫిజిక్స్ విభాగం సందడి..

### అంగరంగ వైభవంగా బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం



**కేయూ క్యాంపస్, 9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలోని భౌతిక శాస్త్ర విభాగంలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్సవాలను ప్రారంభించారు. విభాగాధిపతి డాక్టర్ జి. పద్మజ ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు నూనావత్ రాధా, సదాలక్ష్మి, చాకలి ఐలమ్మ కోడలు చిట్యాల శ్వేత ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే ఈ పండుగ రాష్ట్ర ప్రజల సాంస్కృతిక వారసత్వానికి అద్దం పడుతుందని తెలిపారు. విభాగాధిపతి డాక్టర్ జి. పద్మజ మాట్లాడుతూ, బతుకమ్మ సంప్రదాయం వెనుక ఉన్న ప్రకృతి పరిరక్షణ, పూల వైవిధ్యం, పర్యావరణ ప్రాధాన్యత వంటి అంశాలను వివరించారు. వివిధ రకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో భౌతిక శాస్త్ర విభాగం ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సంప్రదాయ పాటలు, ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు అవకాశం కల్పించాలి

### పద్మశాలి బీసీ ముద్దుబిడ్డకు సముచిత గుర్తింపు ఇవ్వాలి : బైరి రవి



**హనుమకొండ, 9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

రానున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నామినేషన్లలో ప్రముఖ విద్యావేత్త, విశ్రాంత ఆర్థికశాస్త్ర ఆచార్యులు ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు అవకాశం కల్పించాలని పద్మశాలి సంఘం కొత్తగట్టు సింగారం గ్రామ యువజన అధ్యక్షుడు, కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి బైరి రవి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యా, సామాజిక రంగాల్లో పద్మశాలి సామాజిక వర్గం విశేష సేవలు అందిస్తోందని, రాజకీయ ప్రాతినిధ్యంలోనూ సముచిత గుర్తింపు కల్పించాలని అన్నారు. విద్యారంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే విద్య, యువత అభివృద్ధి, సామాజిక సంక్షేమ అంశాలపై శాసనమండలిలో చర్చలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికలో విద్యారంగ అనుభవం, సామాజిక సేవకు ప్రాధాన్యతనిస్తూ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ పేరును పరిశీలించాలని ముఖ్యమంత్రి, ప్రభుత్వ పెద్దలకు బైరి రవి విజ్ఞప్తి చేశారు.

# జర్నలిస్టుల రైల్వే పాసులు పునరుద్ధరించాలి

**రక్షణ చట్టం పటిష్టత, టోల్ ఫీజు మినహాయింపునకు టీఎంజేఎఫ్ వినతి**

**కరీంనగర్, 9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

జర్నలిస్టులకు రైల్వే పాసులు పునరుద్ధరించాలని, రక్షణ చట్టాన్ని పటిష్టం చేయడంతో పాటు టోల్ ఫీజు మినహాయింపు కల్పించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం (టీఎంజేఎఫ్) రాష్ట్ర నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కోరారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. విధి నిర్వహణలో జర్నలిస్టులకు భద్రత కల్పించాలని, వార్తా సేకరణ కోసం ప్రయాణించే వారికి రైల్వే పాసులు, టోల్ ఫీజు మినహాయింపు పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు టీఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లెపాక రాజేష్, కోశాధికారి బోట్ల సదానందం, పసుల తిరుపతి, వక్కల వెంకటస్వామి, అనిల్, సర్వాణి శ్రీనివాస్, గాజుల స్వామి, మాతంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మకు ప్రత్యేక స్థానం

**కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు గౌడ్**
**కేయూ తెలుగు శాఖలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం**



**కేయూ క్యాంపస్, 9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య మామిడి లింగయ్య ఆధ్వర్యంలో మానవీయ శాస్త్రాల భవనం ఎదుట వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు గౌడ్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానానికి, సాంస్కృతిక వైభవానికి, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించడం, సంప్రదాయ పాటలు, ఆటలతో వేడుకలు నిర్వహించడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో తెలంగాణ భాష, సాహిత్యం, కళలు, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కర్రె సదాశివ, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ గడ్డం కృష్ణ, డాక్టర్ సత్యనారాయణ, అన్నపూర్ణ, స్వామి నాయక్, తెలుగు శాఖ విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయ పండుగ బతుకమ్మ

**ప్రకృతితో ముడిపడిన సంస్కృతికి ప్రతీక**
**కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం**




**కేయూ క్యాంపస్, 9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు తెస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాలకమండలి సభ్యురాలు అనితా రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ ప్రకృతి పరిరక్షణ, సామాజిక ఐక్యత, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయంలోని భౌతికశాస్త్ర విభాగం, కామర్స్ కళాశాల, ఇన్ఫర్మాటిక్స్ విభాగం తదితర చోట్ల కూడా బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు సంప్రదాయ పాటలు, ఆటలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో వివిధ విభాగాల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో హన్మకొండ చిన్నారి యశికకు చోటు

**ఒక్క నిమిషంలో 110 మానవ శరీర భాగాల పేర్లు చెప్పి అరుదైన ఘనత**




**హనుమకొండ, 9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ ప్రోగ్రెస్ హైస్కూల్ విద్యార్థిని బోయిని యశిక తన అసాధారణ జ్ఞాపకశక్తితో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఎనిమిదేళ్ల నాలుగు నెలల వయసులోనే ఒక్క నిమిషంలో మానవ శరీరంలోని తొమ్మిది వ్యవస్థలకు చెందిన 110 భాగాల పేర్లు చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్--2026లో స్థానం సంపాదించింది. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో యశికను అతిథులు అభినందించారు. హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నేరెళ్ల వెంకట హైమ పూజిత, కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ కె. అనితారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కాళోజీ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ రెక్టర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, చిన్న వయసులోనే జాతీయ స్థాయి రికార్డు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ తమ ప్రతిభను వెలికితీసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ మల్లాది ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యశికను పలువురు అభినందించారు. ఆమె సాధించిన ఘనత పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచింది.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**16 కళాశాలలకు చెందిన 2,000 మంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమం**






**హనుమకొండ, 9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు కేయూ పోలీస్ స్టేషన్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్కిల్ స్టార్క్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు, లఘు చిత్రాల ద్వారా సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ అవగాహనను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా తెలియజేసి సైబర్ నేరాల నివారణలో భాగస్వాములు కావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 16 ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ కళాశాలలకు చెందిన సుమారు 2,000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సెంట్రల్ జోన్ డీసీపీ డి. కవిత, హనుమకొండ ఏసీపీ పి. నర్సింహారావు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏసీపీ ఎం. వెంకటరమణ, కేయూ పోలీస్ స్టేషన్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో నైపుణ్య శిక్షణ ముగింపు

**45 మంది విద్యార్థులకు మహీంద్రా ప్రైడ్ ఉపాధి నైపుణ్యాల శిక్షణ**




**కేయూ క్యాంపస్, 9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో టాస్క్ సహకారంతో నిర్వహించిన వారం రోజుల మహీంద్రా ప్రైడ్ క్లాస్రూమ్ ఉపాధి నైపుణ్య శిక్షణ కార్యక్రమం అక్టోబర్ 9న ముగిసింది. అక్టోబర్ 3 నుంచి 9 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శిక్షకుడు థామస్ గోగులమూడి విద్యార్థులకు కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ మాట్లాడుతూ, విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం అవసరమని తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్తలు ఆర్. లక్ష్మణ్ నాయక్, డాక్టర్ పి. సంతోష్ కుమార్ పాల్గొన్నారు. శిక్షణకు సహకరించిన టాస్క్, మహీంద్రా ప్రైడ్ క్లాస్రూమ్ సంస్థలకు కళాశాల కృతజ్ఞతలు తెలిపింది.

# కూలిపోయే ప్రమాదం ఉన్న ఎండిపోయిన చెట్ల తొలగింపు

**కాజీపేట జంక్షన్ నుంచి బాపూజీనగర్ వరకు ట్రాఫిక్ పోలీసుల ముందస్తు చర్యలు**



**కాజీపేట, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్)**

ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురు గాలుల నేపథ్యంలో రహదారి వెంట ఉన్న ఎండిపోయిన, కుళ్లిపోయిన చెట్లతో ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో కాజీపేట ట్రాఫిక్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట జంక్షన్ నుంచి బాపూజీనగర్ వరకు రోడ్డుకు ఎడమ వైపున ఉన్న ప్రమాదకరమైన ఎండిపోయిన చెట్లను తొలగించారు. కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పీ. వెంకన్న ఆధ్వర్యంలో ఎస్ఐ బి. మంగతో పాటు ట్రాఫిక్ సిబ్బంది, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జిడబ్ల్యూఎంసి) డీఆర్ఎఫ్ బృందం కలిసి ఈ తొలగింపు చర్యలు చేపట్టింది. వర్షాలు, ఈదురు గాలుల సమయంలో చెట్లు విరిగి రహదారిపై పడటం ద్వారా వాహనదారులు, పాదచారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా చెట్లను తొలగించినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు, వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారుల వెంట ప్రమాదకరంగా ఉన్న చెట్లు, కొమ్మలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

# మెస్ రెన్యువల్ పేరుతో అధిక ఫీజుల వసూలు ఆపాలి

**రూ.500కు బదులు రూ.100 మాత్రమే వసూలు చేయాలి**
**పీడీఎస్‌యూ కాకతీయ యూనివర్సిటీ కార్యవర్గం డిమాండ్**

**కేయూ క్యాంపస్, 9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ విద్యార్థుల మెస్ రెన్యువల్ కోసం రూ.100కు బదులుగా ఒక్కో విద్యార్థి నుంచి రూ.500 వసూలు చేయడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం యూనివర్సిటీ పరిపాలనా భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బి. వంశీకృష్ణ మాట్లాడుతూ, మెస్ రెన్యువల్ పేరుతో విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వెంటనే విద్యార్థులకు తిరిగి చెల్లించాలని, రూ.100 మాత్రమే రెన్యువల్ ఫీజుగా వసూలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసిన బాధ్యులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే యూనివర్సిటీ పరిపాలనా భవనం ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శివ, పవిత్ర, నికిత, అఖిల, మహేశ్వరి, సాగర్, విద్వాన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ సంక్షేమ పథకాల అమలులో అర్హులందరికీ న్యాయం జరగాలి

**రిజర్వేషన్లు, పదోన్నతులు, ఉప ప్రణాళిక నిధుల వినియోగంపై సమగ్ర సమీక్ష**



**హైదరాబాద్, 9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఎస్సీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సూచించారు. షెడ్యూల్డ్ కులాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సమర్థవంతంగా ప్రజలకు చేరాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణం కమిటీ హాల్‌లో శుక్రవారం శాసన మండలి షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ చైర్మన్ డాక్టర్ మేడిపల్లి సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యక్ష నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలు, ఎస్సీ సంక్షేమ పథకాలు, ఎస్సీ ఉప ప్రణాళిక కింద కేటాయించిన నిధుల వినియోగంపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ హక్కులు సమర్థవంతంగా అమలయ్యేలా సంబంధిత శాఖలు పర్యవేక్షించాలని, నియామకాలు, పదోన్నతుల ప్రక్రియలో నిబంధనలకు అనుగుణంగా పారదర్శకత పాటించాలని నాగరాజు సూచించారు. ఎస్సీ ఉప ప్రణాళిక నిధులను నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా వినియోగిస్తూ, విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పన, అణగారిన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ కార్యక్రమాలు అమలయ్యేలా శాసనసభ కమిటీలు నిర్వహించే సమీక్షలు కీలకమని సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు వెడ్మా బొజ్జు, మందుల సామ్యూల్, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, ఎమ్మెల్సీలు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్య, గోరటి వెంకన్న, ఎస్సీ శాఖ కార్యదర్శి ఇంద్రవిజేంద్ర బోయి, ఎస్సీ గురుకులాల కార్యదర్శి గుగులోత్ రవి, అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సుధాకర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే పోలీసుల పరమ ధ్యేయం

**ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి**
**వార్షిక తనిఖీలో వరంగల్ సీపీ ఎన్. శ్వేత, ఐపీఎస్**






**వరంగల్, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్)**

ప్రజలకు సేవ చేయడమే పోలీసుల పరమ ధ్యేయమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చిన్నచిన్న సమస్యలకు కూడా పోలీసులను ఆశ్రయిస్తారని, అలాంటి సమయంలో వారికి న్యాయం చేసి ప్రజల మెప్పు పొందాలని సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ముల్కనూరు పోలీస్ స్టేషన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు ఎస్సై ఎం. రాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ పరిసరాలు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించిన సీపీ ఎన్. శ్వేత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో మర్యాదగా వ్యవహరించాలని అన్నారు. ప్రజల సమస్యలను ఓపికగా విని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సేవ చేయడం పోలీసులకు దక్కిన గౌరవమని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సీపీ పేర్కొన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ పోలీసులపై మరింత విశ్వాసం పెరిగేలా పనిచేయాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ ఎన్. శ్వేత మామిడి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సీఐ కె. శ్రీను, ముల్కనూరు ఎస్సై ఎం. రాజు, వంగర ఎస్సై దివ్యతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రకాళి దేవస్థానాన్ని సందర్శించిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

**వరంగల్, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద శుక్రవారం వరంగల్‌లోని శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమె వెంట తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, రాజేశ్వరరావు తదితరులు ఉన్నారు. దేవస్థానానికి చేరుకున్న నేరెళ్ల శారదకు ఆలయ కార్యనిర్వహణాధికారి సునీత, అర్చకులు భద్రకాళి శేషు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు నేరెళ్ల శారదకు మహాదాశీర్వచనం నిర్వహించి, అమ్మవారి శేష వస్త్రాలను బహూకరించారు. అనంతరం అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు భద్రకాళి అమ్మవారి దేవస్థానం విశిష్టత, ఆలయంలో నిర్వహించే పూజా కార్యక్రమాలు, ప్రత్యేక ఉత్సవాల గురించి ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# వడ్డెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సస్పెండ్

**బాలికల పట్ల అనుచిత ప్రవర్తన ఆరోపణలు..**
**కలెక్టర్ ఆమోదంతో విద్యాశాఖ చర్యలు**

**హన్మకొండ, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా వడ్డెపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎల్. నరేందర్ నాయక్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించారని, అసభ్య పదజాలం ఉపయోగించారని, ఇతర దుష్ప్రవర్తనకు పాల్పడ్డారనే తీవ్ర ఆరోపణలు రావడంతో తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందాయి. ఈ వ్యవహారంలో పోలీసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది జోక్యం చేసుకోగా, తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్‌తో పాటు ఇతర విద్యార్థి సంఘాలు కూడా అధికారులకు వినతిపత్రాలు సమర్పిం చాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ ‌ మేజిస్ట్రేట్ పరిశీలించి, సస్పెన్షన్‌కు ఆమో దం తెలిపారు. దీంతో తెలంగాణ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) రూల్స్, 1991 ప్రకారం ఎల్. నరేందర్ నాయక్‌ను తక్షణమే సస్పెండ్ చేశారు. క్రమశిక్షణా చర్యలు పూర్తయ్యే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థుల భద్రత, గౌరవం, సంక్షేమమే విద్యాశాఖకు అత్యంత ప్రాధాన్యమని, విద్యార్థుల పట్ల అనుచిత ప్రవర్తనకు సంబంధించిన ఫిర్యాదులపై నిబంధనల ప్రకారం తక్షణమే చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.



Proceedings of the District Educational Officer (FAC): Hanumakonda
Present: Sri. L. V. Giriraj Goud

Proc. Rc. No. 5054/B1/2026 Dated: 09.10.2026

Sub: School Education – Hanumakonda District – Government Primary School, Waddepally – Sri L. Narender Naik, LFL Headmaster – Serious allegations of misconduct towards girl students of Classes IV and V, use of vulgar language and other acts of misconduct – Enquiry report of the Mandal Educational Officer, Hanumakonda – Approval of the District Collector & Magistrate, Hanumakonda – Placed under suspension with pending enquiry – Orders – Issued.

Ref: 1. Representation submitted by the Telangana Students Federation regarding the alleged misconduct of Sri L. Narender Naik, LFL Headmaster, Government Primary School, Waddepally.
2. News reports published in Eenadu, Andhra Jyothi and Sakshi newspapers dated 09.10.2026.
3. Enquiry report of the Mandal Educational Officer, Hanumakonda, dated 09.10.2026.
4. Note approval of the District Collector & Magistrate, Hanumakonda, Dated: 09.10.2026.

@@@@@

ORDER:

Whereas, serious allegations have been reported against Sri L. Narender Naik, LFL Headmaster, Government Primary School, Waddepally, Hanumakonda District, concerned to alleged inappropriate conduct towards girl students of Classes IV and V, use of vulgar language and other acts of misconduct.

And whereas, the matter has attracted complaints from parents, intervention by Police and Child Helpline personnel, representations from student unions, and extensive adverse media coverage, with the incident being widely reported and circulated through various media platforms, necessitating immediate administrative action in the interest of the safety, dignity and welfare of the students.

And whereas, the Mandal Educational Officer, Hanumakonda, has conducted an enquiry into the matter and submitted a report vide reference 3rd cited, wherein serious allegations of misconduct concerning the safety, dignity and welfare of the students have been reported and found to be substantiated, warranting further administrative action in accordance with the applicable rules.

And whereas, the matter has been submitted to the District Collector & Magistrate, Hanumakonda, for consideration, and the District Collector & Magistrate has accorded approval for placing the individual under suspension from service with immediate effect.

Now, therefore, in exercise of the powers conferred under the relevant provisions of the Telangana Civil Services (CCA) Rules, 1991, L. Narender, LFL Headmaster, Government Primary School, Waddepally Hanumakonda District, is hereby placed under suspension with immediate effect pending finalization of the disciplinary proceedings.

It is further ordered that during the period of suspension, the individual shall be entitled to subsistence allowance and other admissible benefits in accordance with the rules in force.

Receipt of these proceedings shall be acknowledged forthwith

Sd/- L.V.Giriraj Goud
District Educational Officer (FAC)
Hanumakonda

To:
Sri L. Narender Naik, LFL HM, Govt. Primary School, Waddepally, Hanumakonda through MEO Hanuamkonda
Copy to:
The District Collector & Magistrate, Hanumakonda, for favour of information.
The Regional Joint Director of School Education, Warangal, for information.
The Mandal Educational Officer, Hanumakonda, for necessary action.
Superintendent



# ఐ అండ్ పీఆర్ అదనపు సంచాలకుడు డీఎస్ జగన్‌కు ఘన సన్మానం

**జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటరమణ సహా పలువురు అధికారులకు సత్కారం**



**వరంగల్, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్)**

సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్ జగన్ తొలిసారిగా వరంగల్‌కు విచ్చేసిన సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్‌లు డీఎస్ జగన్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటరమణ, పూర్వ డీపీఆర్వో మనోహరాచారి, వరంగల్ జిల్లా డీపీఆర్వో ప్రేమలత, ఖమ్మం డీపీఆర్వో గౌస్ పాషా, రిటైర్డ్ ఉద్యోగి విధుమౌళిలు ప్రెస్ క్లబ్‌కు విచ్చేసిన సందర్భంగా వారిని కూడా శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో సమాచార, పౌర సంబంధాల శాఖలో వారు అందించిన సేవలను ప్రెస్ క్లబ్ బాధ్యులు కొనియాడారు. అధికారులు, మీడియా ప్రతినిధుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ సుధాకర్, ఈసీ సభ్యులు నయీం పాషా, అంజి తదితరులు పాల్గొన్నారు.

# కాన్షీరామ్ 20వ వర్ధంతి సభ ఘనంగా

**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ జెండా ఎగురవేస్తాం**
**జిల్లా అధ్యక్షుడు వనం మహేందర్**



**వరంగల్,9 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

బహుజన ఉద్యమ నేత, బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షీరామ్ 20వ వర్ధంతి సభను శుక్రవారం వరంగల్‌లోని నాని గార్డెన్‌లో బీఎస్పీ వరంగల్ జోన్-2 ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ జోనల్ ఇన్‌చార్జి దాగిళ్ల దయానంద్, విశిష్ట అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్, జోనల్ ఇన్‌చార్జులు వర్కిల్లా మల్లేశం, కర్రి కృష్ణ, పార్లమెంట్ ఇన్‌చార్జి బస్కే నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా అధ్యక్షుడు వనం మహేందర్ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బహుజనుల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం కాన్షీరామ్ చేసిన కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వస్కుల ప్రవీణ్, ఆకులపల్లి బాబు, పోలేపాక ఉపేందర్, పోలేపాక లోకేష్, వరంగల్ తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు జన్ను అనిల్ కుమార్, రజినీకాంత్, సమ్మయ్య, చంద్రశేఖర్, శ్రీధర్‌తో పాటు పలువురు బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూముల రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలిద**
**హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి**
**కామారెడ్డిపల్లిలో భూముల రీసర్వే ప్రక్రియ పరిశీలన**

**పరకాల, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్)**

భూముల రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. శుక్రవారం పరకాల మండలం కామారెడ్డిపల్లి గ్రామంలో చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ ఎన్. రవి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన భూముల వివరాలతో పాటు ఇప్పటివరకు చేపట్టిన రీసర్వే పురోగతిపై సర్వేయర్లు, సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక రైతులతో అదనపు కలెక్టర్ మాట్లాడి భూములకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రీసర్వే ప్రక్రియ ద్వారా భూముల హద్దులు, రికార్డుల్లోని వివరాలు స్పష్టత పొందడంతో భవిష్యత్తులో భూ వివాదాలు, సమస్యలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్. రవి మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సర్వేయర్లను ఆదేశించారు. రీసర్వే విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతులు అధికారులకు, సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. గ్రామంలో తదుపరి ఏయే రైతుల భూముల్లో రీసర్వే చేపట్టనున్నారనే సమాచారాన్ని ముందుగానే సంబంధిత రైతులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ విజయలక్ష్మి, సర్వేయర్ విజయ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.



# స్మార్ట్ సిస్టమ్ డిజైన్‌పై హ్యాండ్స్‌ఆన్ వర్క్‌షాప్ ప్రారంభం

**హసన్ పర్తి, అక్టోబర్ 9(జై భీమ్ న్యూస్)**

కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) వరంగల్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల హ్యాండ్స్‌ఆన్ వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. కిట్స్ క్యాంపస్‌లోని సివిల్ సెమినార్ హాల్‌లో "ఆర్డుయినో మరియు సెన్సార్లను ఉపయోగించి స్మార్ట్ సిస్టమ్ డిజైన్" అనే అంశంపై ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నారు. వరంగల్‌కు చెందిన జీజీ మాడ్ సెహావి ఏఐఓటీ సొల్యూషన్స్ సహకారంతో అక్టోబర్ 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌లో 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై విద్యార్థులు ఆసక్తి చూపుతూ, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఉత్సాహంగా పాల్గొంటున్నారని కిట్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి తెలిపారు. వర్క్‌షాప్‌లో జీజీ మాడ్ సెహావి ఏఐఓటీ సొల్యూషన్స్ సీఈఓ ఆకాష్‌తో పాటు ధనుష్, మోక్షిత్ రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు ఆర్డుయినో ప్రోగ్రామింగ్, సెన్సార్ ఇంటర్‌ఫేసింగ్, స్మార్ట్ సిస్టమ్ డిజైన్, రియల్‌టైమ్ అప్లికేషన్లపై ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నారు. ఆర్డుయినో, ఐడీఈ పరిచయం, వివిధ సెన్సార్ల వినియోగం, ఆర్డుయినోతో సెన్సార్ల అనుసంధానం, హ్యాండ్స్‌ఆన్ ప్రాజెక్టులు, ఐఓటీ అప్లికేషన్లు, రియల్‌టైమ్ అప్లికేషన్లు, స్మార్ట్ సిస్టమ్ డిజైన్ వంటి అంశాలపై



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఆర్డుయినో బోర్డులు, వివిధ సెన్సార్లను ఉపయోగించి వినూత్న స్మార్ట్ సిస్టమ్‌లను రూపొందించే అవకాశం విద్యార్థులకు కల్పించారు. ఈ సందర్భంగా ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ జి. రఘోత్తం రెడ్డి అధ్యక్షోపన్యాసం చేశారు. ఆర్డుయినో ప్రోగ్రామింగ్, సెన్సార్ ఇంటర్‌ఫేసింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), స్మార్ట్ సిస్టమ్ డిజైన్‌లో విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించడమే వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని వాస్తవ ప్రపంచ అనువర్తనాలతో అనుసంధానం చేయడానికి ఇలాంటి హ్యాండ్స్‌ఆన్ శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ. శ్రీనివాస్, వర్క్‌షాప్ ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు డాక్టర్ ఎం. రాజు, పి. రామచందర్ రావు, ఎ. పవన్, డాక్టర్ కె. సౌజన్య, డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ ముకీమ్, ఇ. సుస్మిత, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, రసాయన శాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్, పిఆర్ఓ డాక్టర్ డి. ప్రభాకర చారి తదితరులు పాల్గొన్నారు. 100 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వానాకాలం పంటలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి





**యాసంగి సాగు ప్రణాళికను నీటి లభ్యతకు అనుగుణంగా రూపొందించాలి**

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**వరంగల్, అక్టోబర్ 9, 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో వానాకాలం--2026 పంటల పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రానున్న యాసంగి--2026--27 సాగు ప్రణాళికను నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, సాగునీటి వనరులను దృష్టిలో ఉంచుకుని రూపొందించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్.. వానాకాలం పంటలు, వర్షపాతం, వ్యవసాయ కార్యకలాపాలు, యాసంగి సాగు ప్రణాళిక, తాగునీటి సరఫరా, జల సంరక్షణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 17 శాతం లోటు వర్షపాతం నమోదైందని, అక్టోబర్ 1 నుంచి 9వ తేదీ వరకు వర్షపాత లోటు 99 శాతంగా ఉందని తెలిపారు. వర్షపాత లోటు కారణంగా కొన్ని జిల్లాల్లో పంటలు వాడిపోవడం, ఎండిపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితులను నిరంతరం పరిశీలించాలని, ముఖ్యంగా పత్తి, వరి తదితర పంటలపై వర్షాభావ ప్రభావాన్ని అంచనా వేసి రైతులకు అవసరమైన వ్యవసాయ సలహాలు అందించాలని ఆదేశించారు. వానాకాలం--2026లో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి మొత్తం 1 కోటి 31 లక్షల 38 వేల 611 ఎకరాల్లో సాగు నమోదైనట్లు తెలిపారు. ఇందులో 57 లక్షల 4 వేల 59 ఎకరాల్లో వరి, 48 లక్షల 43 వేల 606 ఎకరాల్లో పత్తి, 5 లక్షల 92 వేల 472 ఎకరాల్లో మొక్కజొన్న, 7 లక్షల 97 వేల 772 ఎకరాల్లో పప్పుధాన్యాలు సాగయ్యాయని వివరించారు. రానున్న యాసంగి--2026--27లో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి 65 లక్షల 89 వేల 293 ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నామని, గత యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈసారి 29.3 శాతం తక్కువ సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసినట్లు తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో వరి సాగును నిరుత్సాహపరుస్తూ, ఆయా ప్రాంతాలకు అనువైన ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతు ఐడీల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు వానాకాలం--2026 ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు తరచూ సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయి సిబ్బంది, రైతు వేదికల ద్వారా రైతులకు సకాలంలో వ్యవసాయ సలహాలు అందించాలని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా మిషన్ భగీరథ, సాగునీటి శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, పంచాయతీరాజ్, ప్రజారోగ్య ఇంజినీరింగ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తాగునీటి అవసరాల కోసం కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో 14, గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో 20 కలిపి మొత్తం 34 జలాశయాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఆయా జలాశయాల్లో ఏడాది కాలానికి అవసరమైన తాగునీటికి సరిపడా ముడి నీటిని నిల్వ ఉంచేలా చర్యలు చేపట్టాలని, వాటిపై ఆధారపడిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు ఎగువ జలాశయాల్లోనూ తగిన నీటి నిల్వలు ఉండేలా చూడాలని సూచించారు. గ్రామాల్లోని చేతిపంపులు, నీటి సరఫరా పథకాలు, బహిరంగ బావులు సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టాలని, స్థానిక నీటి వనరులను పరిరక్షిస్తూ నీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో విద్యుత్, సాగునీరు, ప్రజారోగ్య ఇంజినీరింగ్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తాగునీటి సరఫరా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో జలాశయాల డెడ్ స్టోరేజీ నుంచి నీటిని వినియోగించుకునేందుకు తాత్కాలిక పంపుల ఏర్పాటుపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సుమారు 50 లక్షల మంది క్రియాశీల కూలీలు ఉన్న నేపథ్యంలో విబిజి రామ్ జీ పథకం కింద కూలీల సమీకరణను సమర్థవంతంగా చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ అవసరమైన కూలీలను పనుల్లో భాగస్వాములను చేయాలని, జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మ్యాజిక్ సోక్‌పిట్లు, 50 వేల ఫామ్ పాండ్లు, 12 వేల పెర్కొలేషన్ ట్యాంకులు, 12 వేల బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణాల ద్వారా వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణాలను చేపట్టాలని, పనిచేస్తున్న బోరుబావుల వద్ద సోక్‌పిట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎండిపోయిన బోరుబావుల వద్ద భూగర్భ జలాల పునరుద్ధరణకు అనువైన రీచార్జ్ నిర్మాణాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో నీటి సంరక్షణకు అవసరమైన నిర్మాణాలను గుర్తించి వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, సాగునీటి, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులకు సకాలంలో వ్యవసాయ సలహాలు అందించడం, ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయడం, ప్రజలకు నిరంతరం తాగునీరు సరఫరా చేయడం, ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడం, జల సంరక్షణ నిర్మాణాల లక్ష్యాలను సాధించడం వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి జిల్లాలో కాలానుగుణ పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అవసరమైన సూచనలు అందించడంతో పాటు తాగునీటి సరఫరా, వ్యవసాయ పరిస్థితులు, జల సంరక్షణ, ఉపాధి పనులపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్. కిషోర్ కుమార్, డీఆర్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ వసంత, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన ఆరోపణలు

**వడ్డేపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై తల్లిదండ్రుల ఫిర్యాదు**

**సుబేదారి, అక్టోబర్ 9 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హనుమకొండలోని వడ్డేపల్లి ప్రాంతంలో ఉన్న ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. తమ కుమార్తెలతో ప్రధానోపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తించి, అసభ్యకరంగా తాకినట్లు విద్యార్థినులు వెల్లడించారని పేర్కొంటూ వారి తల్లిదండ్రులు సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు ప్రకారం.. సదరు పాఠశాలలో సుమారు 120 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడితో కలిపి కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు సెలవులో ఉన్న సమయంలో విద్యార్థుల విద్యాభ్యాసానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల ప్రధానోపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే మిగిలారని తెలిపారు. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ తల్లిదండ్రులంతా కలిసి హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారిని సంప్రదించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 1న ఉదయం సుమారు 11.45 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి, అదనపు ఉపాధ్యాయుల కేటాయింపు కోసం వినతిపత్రం సమర్పించాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో వినతిపత్రం సిద్ధం చేస్తున్న సమయంలో తన కుమార్తెతో పాటు మరికొందరు విద్యార్థినులు ప్రధానోపాధ్యాయుడు తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని, అనుచితంగా తాకినట్లు వెల్లడించారని తల్లిదండ్రులు తెలిపారు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని విద్యార్థినులతో ప్రమాణం చేయించుకున్నట్లు కూడా వారు ఆరోపించారు. విద్యార్థినులు వెల్లడించిన విషయాలను తెలుసుకున్న తల్లిదండ్రులు పరస్పరం చర్చించుకుని, ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని నిర్ణయించారు. శుక్రవారం, అక్టోబర్ 9న సుబేదారి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి సంబంధిత ప్రధానోపాధ్యాయుడిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విద్యార్థినుల పట్ల జరిగినట్లు ఆరోపిస్తున్న ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు పోలీసులను కోరారు. ఈ మేరకు సుబేదారి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఫిర్యాదును పరిశీలిస్తున్నారు. విద్యార్థినులకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలు మాత్రమే ఉన్నాయని, ఆరోపణలు విచారణలో నిర్ధారణ కావాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

# రైతుల కోసం స్పందించిన బీఆర్ఎస్ నాయకుడు సంగాల విక్టర్ బాబు

**మూడు రోజులుగా నిలిచిన విద్యుత్ సమస్యకు పరిష్కారం..**

**కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు**




**వరంగల్, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్)**

రైతుల సమస్యపై బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు సంగాల విక్టర్ బాబు స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపారు. రైతులకు సాగునీరు అందించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మూడు రోజులుగా పనిచేయకపోవడంతో పంటలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంటలకు సకాలంలో సాగునీరు అందక నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని రైతులు సంగాల విక్టర్ బాబు దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించి సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయకపోవడంతో మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, రైతులు బోర్లు నడపలేక పంటలకు నీరు అందించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు తెలిపారు. పంటలు కీలక దశలో ఉన్నందున సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి పాడైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. దీంతో రైతులకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు మార్గం సుగమమైంది. మూడు రోజులుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం లభించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పంట చేతికొచ్చే కీలక సమయంలో తమ సమస్యను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వెంటనే పరిష్కారం కోసం కృషి చేసిన సంగాల విక్టర్ బాబుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యలపై స్పందించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారం చూపించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించడంలో విద్యుత్ సరఫరా ఎంతో కీలకమని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రైతులు కోరారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు సకాలంలో స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడం పట్ల కూడా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తోట చిన్న రాజు, పెద్ద రాజు, సంగాల పోలీస్ రాజు, తోట రవి తదితరులు పాల్గొని రైతుల సమస్య పరిష్కారానికి సహకరించిన సంగాల విక్టర్ బాబుకు అభినందనలు తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# ఎయిడ్స్ నివారణలో వరంగల్ జిల్లాకు జాతీయస్థాయి గుర్తింపు






### డీఎంహెచ్ఓ డా. రాజారెడ్డి

**వరంగల్, అక్టోబర్ 9(జై భీమ్ న్యూస్)**

హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ, నివారణ కార్యక్రమాల అమలులో మెరుగైన పనితీరు కనబరిచిన వరంగల్ జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల పనితీరుపై ఇటీవల విడుదల చేసిన ర్యాంకుల్లో వరంగల్ జిల్లా 'సురక్షిత్' స్థానం సాధించింది. జిల్లా కలెక్టర్ సత్య శారద మార్గదర్శకత్వంలో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రాజారెడ్డి పర్యవేక్షణలో ఐసీటీసీలు, ఏఆర్టీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో హెచ్ఐవీ నియంత్రణ, నివారణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా. రాజారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాకు లభించిన 'సురక్షిత్' గుర్తింపును కొనసాగించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో మరింత కృషి చేయాలని సూచించారు. ఇదే పనితీరును రానున్న ఆరు నెలల పాటు కొనసాగించి 'సురక్షిత్ ప్లస్' స్థాయిని సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని తెలిపారు.

**ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు, చికిత్స**

ప్రభుత్వం హెచ్ఐవీ బాధితులకు ఉచితంగా యాంటీ రెట్రోవైరల్ మందులు, కౌన్సిలింగ్, సీడీ4 పరీక్షలు, వైరల్ లోడ్ పరీక్షలు అందిస్తున్నట్లు డీఎంహెచ్ఓ వివరించారు. హెచ్ఐవీని ముందస్తుగా గుర్తించడం, సకాలంలో చికిత్స ప్రారంభించడం, చికిత్సను నిరంతరం కొనసాగించడం, వైరల్ సప్రెషన్ సాధించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవీపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడం, బాధితుల పట్ల వివక్షను నిర్మూలించడం, ప్రజల్లో అవగాహన పెంచడం వంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు ఎలాంటి భయాలు, అపోహలకు గురికాకుండా అవసరమైతే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఐసీటీసీ కేంద్రాల్లో ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు చేయించుకుని, సకాలంలో అవసరమైన చికిత్స పొందాలని వైద్యశాఖ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పీ.ఓ. డా. అరుణ్ కుమార్ జోషి, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ స్వప్న మాధూరి, ఐసీటీసీ సూపర్వైజర్ రామకృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ కమలాకర్, ఐసీటీసీ కౌన్సిలర్లు, సహయోగి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు జాబితాల రూపకల్పన పారదర్శకంగా చేపట్టాలి

### ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియ పూర్తి చేస్తాం
### కలెక్టర్ డాక్టర్ సత్య శారద







**వరంగల్, 9 అక్టోబరు 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి ఓటరు జాబితాల పునఃరూపకల్పన ప్రక్రియపై భారత ఎన్నికల సంఘం సమీక్ష నిర్వహించింది. 2026 నవంబర్ 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తూ పట్టభద్రుల ఓటరు జాబితాలను కొత్తగా రూపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల సంఘం కమిషనర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఓటరు నమోదు ప్రక్రియ, జాబితాల తయారీకి అనుసరించాల్సిన విధివిధానాలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. నిర్దేశిత నిబంధనల ప్రకారం ఓటరు జాబితాల రూపకల్పన చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియతో పాటు ఎన్నికలకు సంబంధించిన అన్ని పనులను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ ఓటరు జాబితాల రూపకల్పనను పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి, ఎన్నికల సూపరింటెండెంట్ రజినితో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రికార్డు ఛేదనతో చరిత్ర సృష్టించిన వెస్టిండీస్.. భారీ లక్ష్యాన్ని ఊదిపారేసిన కరీబియన్లు

టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యంత గొప్ప ఛేదనల్లో ఒకదాన్ని నమోదు చేస్తూ వెస్టిండీస్ అద్భుత విజయం సాధించింది. భారత్తో రాంచీ వేదికగా గురువారం జరిగిన రెండో టీ20లో 250 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 18.3 ఓవర్లలోనే 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్ల సిరీస్ను 1-1తో సమం చేసింది. 250 పరుగుల లక్ష్య ఛేదనలో విండీస్కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. భారత యువ పేసర్ మయాంక్ యాదవ్ తన తొలి ఓవర్లోనే రెండు వికెట్లు పడగొట్టి ఒత్తిడి పెంచాడు. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ షాయ్ హోప్, షెర్ఫేన్ రూథర్ఫర్డ్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. వీరిద్దరూ నాలుగో వికెట్కు 120 పరుగుల విధ్వంసకర భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశారు. కెప్టెన్ షాయ్ హోప్ కేవలం 45 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్సర్లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరోవైపు, రూథర్ఫర్డ్ 37 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సర్లతో 84 పరుగులు చేసి ఔటయ్యాడు. చివర్లో హోప్ సిక్సర్తో గెలుపును అందించడమే కాకుండా, తన సెంచరీని కూడా పూర్తి చేసుకున్నాడు. టీ20 క్రికెట్లో వెస్టిండీస్కు ఇదే అత్యధిక విజయవంతమైన ఛేదన కావడం విశేషం. అంతర్జాతీయ టీ20ల్లో ఇది రెండో అత్యధిక ఛేదనగా రికార్డు సృష్టించింది. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. సంజూ శాంసన్ 41 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 82 పరుగులు చేసి టాప్ స్కోరర్గా నిలిచాడు. ఇషాన్ కిషన్ (43), శ్రేయస్ అయ్యర్ (40), తిలక్ వర్మ (44 నాటౌట్) కూడా రాణించారు. భారీ స్కోరు చేసినప్పటికీ, భారత బౌలర్లు దానిని కాపాడుకోవడంలో విఫలమయ్యారు. మయాంక్ యాదవ్ మూడు వికెట్లతో ఆకట్టుకున్నా, మిగతా బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. ఇక ఇరు జట్ల మధ్య మూడో టీ20 అక్టోబర్ 11న ఇండోర్లోని హోల్కర్ స్టేడియంలో జరగనుంది.





## ఆ విమర్శలు పట్టించుకుంటే భయంతో ఆగిపోయేదాన్ని: కత్రినా

### సోషల్ మీడియా ట్రోలింగ్పై స్పందించిన నటి కత్రినా కైఫ్
### ట్రోల్స్కు భయపడితే జీవితంలో ముందుకు సాగలేమని వ్యాఖ్య
### ప్రసవానంతరం బాడీ షేమింగ్కు గురైన నేపథ్యంలో స్పందన

బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ సోషల్ మీడియా ట్రోలింగ్, బాడీ షేమింగ్పై ఘాటుగా స్పందించారు. ఆన్లైన్లో వచ్చే ప్రతికూల వ్యాఖ్యలకు భయపడితే జీవితంలో ముందుకు సాగలేమని ఆమె అన్నారు. లండన్లో తన సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడి జననం తర్వాత ఇటీవల కత్రినా తొలిసారిగా బయట కనిపించినప్పుడు, సోషల్ మీడియాలో ఆమె శరీరాకృతిపై కొందరు నెగటివ్ కామెంట్లు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమె స్పందించారు. "సోషల్ మీడియాలో వచ్చే మాటలు మన ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపకుండా చూసుకోవాలి. ప్రతి ఒక్కరి కామెంట్లను పట్టించుకుంటూ పోతే, మనకోసం మనం నిర్ణయాలు తీసుకోలేం. ప్రతి విమర్శకు నేను స్పందించి ఉంటే, భయంతో అక్కడే స్తంభించిపోయేదాన్ని" అని కత్రినా వివరించారు. కొన్నిసార్లు ప్రపంచం మనల్ని ప్రశంసిస్తుందని, మరికొన్నిసార్లు మనకు మనమే ధైర్యం చెప్పుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆమె పేర్కొన్నారు. గతేడాది నవంబర్లో కత్రినా ఓ బాబుకు జన్మనిచ్చారు. ఆ తర్వాత ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు ఆమెపై బాడీ షేమింగ్ కామెంట్లు వచ్చాయి. ఈ ఘటన జరిగిన కొన్ని వారాల తర్వాత ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.